క్లుప్తంగా

రజక సంఘం నూతన కమిటీ నియామకం

చెన్నూర్: చెన్నూర్ పట్టణ రజక సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా నిమ్మల పోచమల్లు, పాయిరాల బాపు, అధ్యక్షులుగా కొండపర్తి వెంకటరాజం, ప్రధాన కార్యదర్శిగా నిమ్మల సంతోష్, కోశాధికారిగా అయిలాల రమేశ్, ఉపాధ్యక్షుడిగా పి. నరేశ్, కార్యవర్గ సభ్యులుగా పొన్న మధు, నిమ్మల రాజులు ఎన్నికయ్యారు.

బాల్యమిత్రుడి కుటుంబానికి భరోసా

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన సోగాల శ్రీనివాస్ ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. అతనితో దండేపల్లి ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివిన 1993–94 బ్యాచ్ విద్యార్థులు రూ.38,500 ఆర్థికసాయాన్ని ఆదివారం శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు అందజేశారు. పూర్వ విద్యార్థులు మాజీ ఎంపీపీ శ్రీనివాస్, కుమారస్వామి, శ్రీనివాస్, గంగాధర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


అక్కల వెంకన్న

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట, హాజీపూర్, దండేపల్లి మండలాల వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం కార్యాలయం ఆవరణలో ఎన్నుకున్నట్లు గౌరవాధ్యక్షుడు కాసనగొట్టు లింగన్న తెలిపారు. అధ్యక్షుడిగా అక్కల వెంకన్న, ఉపాధ్యక్షులుగా గడికొప్పుల కమలాకర్, తోట వేణు, ప్రధాన కార్యదర్శిగా మాధాని క్రిష్ణ, కోశాధికారిగా లషెట్టి సతీశ్, కార్యవర్గ సభ్యులుగా చుంచు రవి, బత్తుల చందు, పనాస రాజేశం, బుద్దె సత్తయ్య, కొనరి రమేశ్, బత్తుల మురళిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

మొక్కలు నాటిన 'వాకర్స్' సభ్యులు


మొక్కలు నాటుతున్న సభ్యులు

పాతమంచిర్యాల: స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం జిల్లా కేంద్రంలోని రాముని చెరువు కట్టపై వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మొక్కలు నాటారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటయ్య, కార్యదర్శి పుప్పిరెడ్డి రాంరెడ్డి, సలహాదారులు, కార్యవర్గ సభ్యులు డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, సాల్మన్‌రాజ్, మూర్తి, విశ్వేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

వేమనపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన పోతుగంటి సంతోష్ వెన్నుపూసకు సంబంధించిన ఆపరేషన్ అనంతరం ఆస్పత్రి నుంచి ఇంటికి రాగా మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌అలీ ఆదివారం పరామర్శించారు. మాజీ సర్పంచ్‌లు గాలి మధు, రాంచందర్, నాయకులు రాజన్న, డొబ్బల సంతోష్, గణపురం సంతోష్, నగేశ్, వెంకటి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

'సేవలకు ప్రతిరూపం వాసవీక్లబ్'


చీరలు పంపిణీ చేస్తున్న రవిచంద్రన్

పాతమంచిర్యాల: వాసవీక్లబ్ అనేక రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సేవకు ప్రతిరూపంగా నిలుస్తుందని వాసవీ క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు రవిచంద్రన్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో వాసవిక్లబ్ వ్యవస్థాపకులు కేసీ గుప్తా జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. నిరుపేద మహిళలకు చీరలు, విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. సభ్యులు, కో ఆర్డినేటర్‌లు, జోన్ చైర్మన్‌లు పాల్గొన్నారు.

బోనాల జాతర

చెన్నూర్: చెన్నూర్ మహంకాళి అమ్మ బోనాల జాతరను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బోనాల జాతర సందర్భంగా పోతురాజుల ఆటపాటలు, శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆదివారం ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ మూల రాజిరెడ్డి ఆలయంలో పూజలు చేశారు.

భవితబడిలో సృజనాత్మకం!


రంగులు తెలిపే బెలూన్ల చిత్రాలు



తరగతి గదిలో వేసిన ఐస్‌క్రీం, పండ్ల చిత్రాలు


బొమ్మ వేస్తున్న సృజన

మంచిర్యాల భవిత కేంద్రంలో విధులు నిర్వహించే ఐఈఆర్పీ సృజన కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టారు. తరగతి గదిలో కాగితంతో అంటించిన చిత్రాలు తరుచూ చిరిగిపోతుండటంతో శాశ్వత చిత్రాలు వేయాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడువుగా తరగతి గదుల్లో అంకెలు, ఏబీసీడీలు, సూక్తులు, సందేశాలతో పాటు వివిధ రకాల చిత్రాలు గీశారు. ఇక్కడ చదివే పిల్లలంతా ప్రత్యేక అవసరాల పిల్లలు కావడంతో వారిని ఆకర్షించేందుకు, వారిలో ఆలోచనాశక్తిని పెంచేందుకు, పాఠాలు గుర్తుంచుకునేందుకు చిత్రాలు ఎంతగానో తోడ్పడుతాయని సృజన పేర్కొంటున్నారు. – మంచిర్యాలఅర్బన్

చినుకుపడితే చిత్తడే..!

- రోడ్లన్నీ బురదమయం
- సింగరేణి కాలనీల్లో మరింత అధ్వానం
- అధికారుల పర్యవేక్షణ కరువు


మార్కెట్ రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త, రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని పలు రోడ్లు వర్షం పడితే చిత్తడిగా మారుతున్నాయి. పట్టణంలో ఎక్కడి నీరు అక్కడే ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. మున్సిపాలిటీలోని 14వార్డుల్లో భారీగా నిధులు వెచ్చించి రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించినా అధికారుల పర్యవేక్షణ లేకుండా ఇష్టారీతిగా నిర్మించడంతో ఇబ్బందులు తప్పడం లేదని, ప్రభుత్వ నిధులు దుర్వినియోగమయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్లపైనే మురికి నీరు నిలుస్తుండడంతో పాటు పారిశుధ్య పనులు లోపించడంతో రోడ్ల పక్కనే చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. రోడ్లు, కాలువలు నిర్మాణం జరిగినప్పుడే రోడ్లపై నీరు నిల్వకుండా కాలువల ద్వారా బయటకు వెళ్లే విధంగా ఏర్పాట్లు చేస్తే ఇబ్బందులు తలెత్తేవి కావని వారు పేర్కొంటున్నారు. కాగా లక్షల రూపాయల నిధులతో నిర్మించిన రోడ్లు రెండేళ్లకే కంకర తేలి గుంతలమయంగా మారాయి. ఇలాంటి రోడ్లకు క్వాలిటీ అధికారులు ఎలా అనుకూలమైన రిపోర్ట్ ఇచ్చారనే విషయంపై ఉన్నతాధికారులు విచారణ చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

సింగరేణి ఏరియాలో అధ్వానం..

మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో 24 వార్డులుండగా, సింగరేణి ఏరియా 10 వార్డుల్లో ఉంది. సింగరేణి ఏరియాలో యాజమాన్యమే అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తోంది. కాలనీల్లో రెండు నెలల క్రితం వేసిన తారురోడ్లు కనీసం రెండు ఇంచులైనా మందం లేకపోవడం.. నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో తారు, కంకర రాళ్లు తేలి అధ్వానంగా తయారయ్యాయి. కొత్తగా బదిలీపై వచ్చిన జీఎం రోడ్లను తనిఖీ చేయాలని కాలనీల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కబ్జాకు గురైన చెరువులను కాపాడుకుందాం


సమావేశంలో మాట్లాడుతున్న విజయధర్మ

జన్నారం: అన్యాక్రాంతమవుతున్న చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఐకమత్యంతో కబ్జాకు గురైన చెరువులను కాపాడుకుందామని చెరువులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కమ్మల విజయధర్మ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో నిర్వహించిన సామాజిక కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రకృతి సహజంగా ఏళ్ల క్రితం ఏర్పడిన చెరువులు నేడు కబ్జాకు గురవుతున్నాయని ఆరోపించారు. కమిటీ ఆధ్వర్యంలో చెరువులు, ప్రభుత్వ భూముల కబ్జాలపై పోరాటం చేస్తామన్నారు.

కమిటీ ఎన్నిక..

మండలంలో అన్యాక్రాంతమవుతున్న చెరువులు, ప్రభుత్వ భూములను కాపాడుకోవడానికి చెరువులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా భూమాచారి, అధ్యక్షుడిగా కమ్మల విజయధర్మా, ఉపాధ్యక్షుడిగా శనిగారపు మహేశ్, ప్రధాన కార్యదర్శిగా కనికారపు ప్రభంజనం, కార్యదర్శులుగా ఎంబడి సత్యం, విజయ్, కోశాధికారిగా కోడి సృజన్, సలహాదారులుగా దాసరి తిరుపతి, కొండపల్లి మహేశ్, సభ్యులుగా వెంకటేశ్, ఎజాస్, వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


ద్వారక గోదావరి తీరం వద్ద వరద ఉధృతి పరిశీలిస్తున్న అధికారులు

వేమనపల్లి: అల్పపీడన ప్రభావంతో భారీగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రమేశ్ అన్నారు. సమీప ప్రాణహిత నది, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున దాటే ప్రయత్నం చేయకూడదని, అత్యవసరమైతే ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలని, పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేస్తూ ఉండాలని సూచించారు.

శ్రీరాంపూర్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండరాదన్నారు. కరెంట్ తీగలు తెగిపడితే విద్యుత్ స్తంభాల వద్ద ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. అత్యవసర పరిస్థితిలో తప్ప బయటకు రాకూడదని పేర్కొన్నారు. వరదలతో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే 100 డయల్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

జైపూర్: మండలంలోని గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భారీ వర్షాలతో పైన ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో గోదావరి నదిలోకి భారీగా వరద నీరు వస్తుందని తహసీల్దార్ వనజారెడ్డి, ఎస్సై శ్రీధర్ తెలిపారు. గోదావరి నదిలో నీటి ప్రవాహం గంటగంటకు పెరుగుతుందని ప్రజలు, మత్స్యకారులు గోదావరి నదిలోకి వెళ్లకూడదని సూచించారు.

పర్యటించి.. అప్రమత్తం చేసి..!

దండేపల్లి: భారీ వర్షాలకు తోడు, కడెం ప్రాజెక్టు 10 వరద గేట్లు ఎత్తి నీటిని గోదావరి నదిలోకి విడుదల చేయడంతో నదిలో వరద ఉధృతి పెరిగింది. దీంతో మండలంలోని గూడెం, ద్వారక, గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్, ఎస్సై ఉదయ్‌కిరణ్ ఆదివారం పర్యటించారు. నదిలో వరద ఉధృతిని పరిశీలించారు. సమీప గ్రామాల ప్రజలు గోదావరి వైపు వెళ్లకూడదని సూచించారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, త్రిమూర్తి, శ్రీనివాస్, రాజన్న, నవీన్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



జన్నారం: మండలంలోని ఇందన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1992 -93 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నిర్వాహకులు దొంతుల చంద్రశేఖర్, కాసారం చంద్రగౌడ్, ఆదిమూలం సత్యం, పులి కాంత కృష్ణలు ఉన్నారు.

ఇళ్ల పట్టాలు ఇప్పించాలని వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సోమగూడంవాసులు

కాసిపేట: ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న తమకు ఇళ్ల పట్టాలు ఇప్పించాలని సోమగూడంవాసులు ఆదివారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ సూచన మేరకు 59 జీవోలో డబ్బులు కట్టినప్పటికీ తమకు పట్టాలు ఇవ్వడం లేదని వాపోయారు. కొందరు భూకబ్జాదారులు అధికారులతో చేతులు కలిపి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. గతంలో కొన్నింటికి పట్టాలు ఇవ్వగా తమకు పట్టాలు అందజేయకపోవడంతో 25 ఏళ్లుగా నివాసం ఉంటున్న తాము ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

శిథిలావస్థలో ఉన్న ఇళ్లు ఖాళీ చేయండి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్, ఎస్సై

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని బూరుదగూడెం ప్రాంతంలో మున్సిపల్, పోలీస్ సిబ్బంది శిథిలావస్థలో ఉన్న రెండు ఇళ్లను ఆదివారం గుర్తించి ఖాళీ చేయించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణంలో కురుస్తున్న భారీ వర్షాలకు ముందస్తు జాగ్రత్తగా శిథిలావస్థలో ఉన్న నివాస గృహాలను ఖాళీ చేయించి, వారిని బంధువుల ఇళ్లకు తరలించామన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న టోల్‌ఫ్రీ నంబర్ 1800 4253611, ల్యాండ్ లైన్ నంబర్ 08736–293611కు కాల్ చేయాలన్నారు. ఎస్సై రాజశేఖర్ ఉన్నారు.

గ్రామ దేవతల ఊరేగింపు


గ్రామదేవతలను ఊరేగిస్తున్న గిరిజనులు

నెన్నెల: మండల కేంద్రంలోని దుబ్బగూడంకు చెందిన గిరిజనులు గ్రామదేవతలను ఆదివారం మండల కేంద్రంలో ఊరేగించారు. గ్రామ దేవతలను స్నానం కోసం పిల్లిబండ ప్రాంతానికి తీసుకెళ్లి, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతీ సంవత్సరం శ్రావణమాసం చివరి రోజుల్లో స్నానానికి గ్రామ దేవతలను తీసుకెళ్తామని పూజారి వెంకటి తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

- ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

పాతమంచిర్యాల: మంచిర్యాల నియోజకవర్గంలో ఈ నెలాఖరులోగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు తెలిపారు. ఆదివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ఐబీ స్థలంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన జరుగునుందని, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కాంగ్రెస్ పార్టీ జాతీయ నేతలు హాజరవుతారన్నారు. రాళ్లవాగు వరద ముంపు రాకుండా కరకట్ట నిర్మాణం, ఎత్తిపోతల పనులు ప్రారంభిస్తామన్నారు. ముల్కల్ల నుంచి పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ వరకు రూ.375 కోట్లతో గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మించనున్నట్లు తెలిపారు. రెండవ బ్రిడ్జి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని పేర్కొన్నారు. రూ.164 కోట్లతో జిల్లా కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్ నుంచి ఏసీసీ క్వారీరోడ్ పాతమంచిర్యాల మీదుగా నేషనల్ హైవే వరకు నాలుగులైన్‌ల రహదారి నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించామని పేర్కొన్నారు. రుణమాఫీ విషయంలో ఏ రైతుకూ నష్టం జరగదన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అవినీతిని సహించబోమని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు భూఆక్రమణదారులకు మద్దతు తెలపడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

జిల్లా కేంద్రంలోని షాదీఖానా మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు 169 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.1.69 కోట్ల విలువ గల షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్యతో కలిసి పంపిణీ చేశారు. నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, మంచిర్యాల మున్సిపల్ వైస్‌చైర్మన్ సల్ల మహేశ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బండారి సుధాకర్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని గురునానక్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేదల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతుల కోసం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని తెలిపారు. లబ్ధిదారులకు మంజూరైన 194 చెక్కులను అందజేశారు. మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, కౌన్సిలర్ చింత సువర్ణ, తహసీల్దార్ దిలీప్, నాయకులు ఎండీ ఆరీఫ్, చింత అశోక్, కొట్నాక తిరుపతి పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలి

పాతమంచిర్యాల: గణేశ్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆదివారం రాత్రి ఆయన నివాసంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గణేశ్ ఉత్సవాల నిర్వహణకు అధికార యంత్రాంగం తగిన సహాయ సహకారాలు అందించాలన్నారు. ఆర్డీవో రాములు, ఫైర్‌అధికారి రాములు, ఏసీపీ ప్రకాశ్, సీఐలు బన్సిలాల్, నరేందర్, మోహన్, అశోక్, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, విద్యుత్ శాఖ డీఈ కైసర్, తహసీల్దార్ రఫత్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో రెస్క్యూ టీం ఏర్పాటు

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో భారీ వర్షాల కారణంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాల మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా రెస్క్యూ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రెస్క్యూ టీం బృందానికి ఆదివారం పలు సూచనలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో అత్యవసర పరిస్థితులు ఉంటే రెస్క్యూ బృందం సేవల కోసం కంట్రోల్‌రూమ్‌కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

కంట్రోల్ రూమ్ నంబర్లు..

బండారు సాయికిరణ్, ఏఈ సెల్: 93814 76116, ఇప్ప రాజ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సెల్: 93473 02179, వెంకటేశ్, జూనియర్ అసిస్టెంట్ సెల్: 86602 91492

మాన్‌సూన్ కంట్రోల్‌రూం ఏర్పాటు

పాతమంచిర్యాల: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మంచిర్యాల మున్సిపాలిటీ కార్యాలయంలో మాన్‌సూన్ ఎమర్జెన్సీ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, కమిషనర్ మారుతీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయమైతే, వరదల కారణంగా ఏవైనా ప్రమాదాలు జరిగితే కంట్రోల్ రూంకు సమాచారం అందించాలన్నారు. కంట్రోల్‌రూం ఫోన్ నంబర్ 9849044106, మున్సిపల్ కమిషనర్, 9849905886, శానిటరీ ఇన్‌స్పెక్టర్ 6302331510లలో సంప్రదించాలన్నారు.

పల్లె దవాఖానలో వైద్యులు ఉండేలా చూడాలి


ఎమ్మెల్యేకు సమస్య వివరిస్తున్న కాలనీవాసులు

మందమర్రిరూరల్: పట్టణంలోని జీఎం ఆఫీస్ ఏరియా, అంగడిబజార్, సీఎస్పీరోడ్ తదితర ఏరియాలకు సంబంధించిన పల్లె దవాఖానలో వైద్యులను నియమించాలని ఆయా కాలనీల ప్రజలు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి విన్నవించారు. ఆదివారం ఉదయం మున్సిపాలిటీ పరిధిలోని 1, 2వ వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే కాలనీల్లోని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ ఏఈ మల్లేశం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఆసుపత్రి ప్రాంగణం.. జలమయం


నీటిని డ్రెయినేజీలోకి మళ్లిస్తున్న అధికారులు

చెన్నూర్: చెన్నూర్‌లో కురిసిన భారీ వర్షం కారణంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణ జలమయంగా మారింది. వర్షపు నీరు ఆసుపత్రి వెనుక గల పద్మశాలీవాడలోని ఇండ్లలోకి చేరడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వర్షపు నీరు లోతట్టు ప్రాంతాలకు వెళ్లకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఆసుపత్రి ప్రాంగణంలో నిలిచిన వర్షపు నీటిని జేసీబీతో యుద్ధ ప్రతిపాదికన డ్రెయినేజీలోకి మళ్లించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగాధర్, చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా, కౌన్సిలర్ అనిల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎడ్లు మృతి

భీమిని: కన్నెపల్లి మండంలోని మెట్‌పల్లి గ్రామపంచాయతీ పరిధి ఎస్సీ కాలనీలో 11కేవీ విద్యుత్ వైర్లు తెగిపడగా రెండు ఎడ్లు మృతి చెందాయి. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు స్థానికంగా ఉన్న పోల్ ఒరగడంతో ఎస్సీ కాలనీ నుంచి వెళ్లే 11కేవీ విద్యుత్ వైర్లు ఆదివారం ఒక్కసారిగా తెగిపడ్డాయి. దీంతో మెట్‌పల్లి గ్రామానికి చెందిన గద్దల స్వామికి చెందిన రెండు ఎడ్లు అక్కడికక్కడే మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని స్వామి వేడుకున్నాడు.

డీవైఎఫ్‌ఐ కమిటీ ఎన్నిక

బెల్లంపల్లి: బెల్లంపల్లి మండల భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) నూతన కమిటీని ఎంపిక చేశారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి కొత్త కమిటీని ఎన్నుకున్నారు. డీవైఎఫ్‌ఐ మండల అధ్యక్షుడిగా మంతెన సంతోష్, ఉపాధ్యక్షులుగా అనిల్ కుమార్, పవన్ కల్యాణ్, వేల్పుల రాజేశ్, తిరుపతి, కార్యదర్శిగా జాడి అరవింద్, సహాయ కార్యదర్శులుగా మనోహర్, రవీందర్, సంకీర్తన్, దేవదాస్, రజినీకాంత్‌లను ఎన్నుకున్నారు. వీరితోపాటు మరో 8మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.